# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో అన్న కాంటీన్‌ల ద్వారా ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **శాస్త్రవిజ్ఞానం ప్రజల పురోభివృద్ధికి తోడ్పడేందుకు డాక్టర్ యలవర్తి నాయుడమ్మ కృషి చేశారని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు.**
3. **నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని తీసుకొచ్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈ రోజు బాపట్ల జిల్లా నగరవనంలో జరిగే జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంలో పాల్గొంటారు.**
5. **తెలంగాణలో ఇటీవల వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో అన్న కాంటీన్‌ల ద్వారా ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అనంతపురంలో నిన్న నిర్వహించిన సూపర్ సిక్స్ – సూపర్ హిట్ విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లకు ఆటో మిత్ర పేరిట 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని దసరా పండుగ సందర్భంగా అందిస్తామని వెల్లడించారు. ఏడాదికి 2.50 లక్షల రూపాయల చొప్పున రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 244 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

---

శాస్త్రవిజ్ఞానం ప్రజల పురోభివృద్ధికి తోడ్పడేందుకు డాక్టర్ యలవర్తి నాయుడమ్మ కృషి చేశారని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో గవర్నర్ నిన్న పాల్గొని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజుకు పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, డాక్టర్

నాయుడమ్మ తన పరిశోధనలు, ఆవిష్కరణల ప్రయోజనాలను పరిశ్రమలకే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా చేశారని తెలిపారు.

---------------------------

నేపాల్‌లో హింసాత్మక ఘటనల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు సుమారు రెండువందల మందికి పైగా ఆంధ్రప్రదేశ్ నివాసితులు నేపాల్‌లో అనేక ప్రదేశాలలో ఉన్నారనే  సమాచారం అందిందని చెప్పారు. సంబంధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని,  ప్రభుత్వం అందరినీ వారి స్వస్థలాలకు తిరిగి చేరుస్తుందని హామీ ఇచ్చారు. వారి కుటుంబాలు సమాచారం పొందడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్ 9818395787ని ఏర్పాటు చేశామని తెలిపారు.

ఇదిలా ఉండగా ఈ అంశంపై విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ గత రాత్రి అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్ .. 33 సెకన్లు

మరోవైపు నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సమాచారం కోసం 9871999044 లేదా 9643723157 నంబర్లను సంప్రదించవచ్చని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది.

---------------------------

అటవీ సంపద పరిరక్షణ ...., వన్య ప్రాణులను కాపాడడం కోసం ప్రాణ త్యాగాలు చేస్తున్న అటవీ అమర వీరుల సేవలను స్మరించుకునే ఉద్దేశ్యంతో ఈ రోజు జాతీయ అటవీ అమర వీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. అటవీ అమర వీరుల సంస్మరణ దినం పాటించాలని  కేంద్ర అటవీ..., పర్యావరణ మంత్రిత్వ శాఖ 2013వ సంవత్సరంలో చేసిన ప్రకటన మేరకు ప్రతి ఏటా సెప్టెంబర్ 11ను అటవీ అమర వీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు.

---------------------------

బాపట్ల జిల్లా సూర్యలంకలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈరోజు పర్యటిస్తారు. ఇందులో భాగంగా సూర్యలంక బీచ్ రోడ్డులో తాటి మొక్కలు నాటి 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ' అనే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం నగరవనంలో జరిగే జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంలో పాల్గొని, అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరిస్తారు. అలాగే అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశమవుతారని అధికారులు  తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను- జిఎస్టిపై తీసుకువచ్చిన సంస్కరణలతో  ప్రజల్లో కొనుగోలు శక్తి పెరుగుతుందని ఆంధ్ర ప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురంలో నిన్న నిర్వహించిన జీఎస్టీ ర్యాలీలో ఆయనను పాల్గొన్నారు.  ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,  సవరించిన జిఎస్టి విధానం దీపావళి నుంచి అమలులోకి వస్తోందన్నారు. వీటి ద్వారా ప్రజలకు పన్నుల నుండి ఉపశమనం లభిస్తుందని,

పలు వస్తువులు చౌక ధరల్లో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

---------------------------

వస్తు సేవల పన్ను జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు అనేక రంగాలలో విశేషమైన ప్రభావాన్ని చూపనున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ స్లాబ్ లను తగ్గించడం ద్వారా అనేక వస్తువుల ధరలు తగ్గనున్నాయని, ముఖ్యంగా వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమాల ప్రీమియంపై వస్తు, సేవల పన్ను జీఎస్టీను పూర్తిగా తొలగించాలనే నిర్ణయం ద్వారా బీమా పాలసీలు మరింత అందుబాటులోకి వస్తాయని పల్నాడు జిల్లాకు చెందిన శ్రీనివాస్ ఆకాశవాణికి తెలుపుతూ,

వాయిస్ 17 సెకన్లు

---------------------------

తెలంగాణలో ఇటీవల వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వర్షాల వల్ల జరిగిన నష్టం, ఇంతవరకు తీసుకున్న సహాయక చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు 10 కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు 5 కోట్ల రూపాయల నిధులను విడుదల చేశామన్నారు. అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు

---------------------------

దక్షిణ ఒడిషా, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సగటున 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఈరోజు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..26 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న రెండు రోజులపాటు ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఓర్వకల్లులో సహజ సిద్ధంగా ఏర్పడ్డ రాక్ గార్డెన్‌ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాక్ గార్డెన్‌ను మంత్రి నిన్న సందర్శించిన సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కర్నూలు పరిసర ప్రాంతాల్లోని సహజ సిద్దంగా ఏర్పడ్డ రాక్ గార్డెన్ ముఖ్యమైన పర్యాటక ప్రదేశాల్లో ఒకటని అన్నారు. ఇది పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోందని తెలిపారు. శ్రీశైలం, అహోబిలం, బెలూం గుహలు, యాగంటి తదితర ప్రదేశాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

=====================